'హ్హాహ్హాహ్హా......' నవ్వాడు బిగ్‌బాస్.

'ప్లీజ్ చెప్పయిన నవ్వండి ..... లేదా నవ్వయినా చెప్పండి బాస్......' దీనంగా ప్రార్థించాడు జాకాల్.

'మన జగ్గూ వీరూలు నీలిమ అనే అమ్మాయిని హత్యచేశారు కదూ?..... ఆ హత్యానేరం రాంబాబు మీద పడింది. పోలీసులు రాంబాబు కోసం వేటాడుకున్నారు....హ్హాహ్హాహ్హా.....'

'హ్హాహ్హాహ్హా.....' ఆ వార్త వింటూనే జగ్గు, వీరూలు కూడా సంతోషం పట్టలేక నవ్వారు.

బిగ్‌బాస్ జాకాల్ వంక మెచ్చుకోలుగ చూశాడు.

'ఈ ఎథో సిస్టమ్ ఎప్పుడు పెట్టించావ్ జాకాల్?' ప్రేమ నిండిన స్వరంతో ప్రశ్నించాడు బిగ్‌బాస్.

'అది మీ నవ్వులాటకు ప్రతిధ్వని కాదు బాస్...... మీరు నవ్విన వెంటనే జగ్గూ వీరూలు నవ్వారు....అంతేకానీ నేనే ఎథోసిస్టమ్ పెట్టలేదు బాస్....'

'ఆహా...నేను నవ్వేటప్పుడు వేరేవాళ్ళు నవ్వకూడదని తెలీదా?' కోపంగా అరిచాడు బిగ్‌బాస్.

'తప్పైపోయింది బాస్' కోరస్‌గా అని జగ్గు వీరూ ఇద్దరూ చెంపలేసుకున్నారు.

'హహహ.....' ఈసారి మరీ గట్టిగా వికటాటహాసం చేసి ఒకసారి నవ్వునాపి జగ్గు, వీరులవంక చూశాడు.

ఈసారి వాళ్ళు నవ్వలేదు.

'గుడ్.....' తృప్తిగా తలపంకించాడు బిగ్‌బాస్.

అందరూ జగ్గూ వీరూలవంక అభినందనగా చూశాడు.

'నీలిమ హత్య మాత్రమేకాదు......ఈ మధ్య మనం చంపేసిన అమ్మాయిని కూడా రాంబాబే హత్యచేసి ఉంటాడని ఇనస్పెక్టర్ శ్రీరామ్ భావిస్తున్నాడు......హహహ......' అన్నాడు బిగ్‌బాస్.

'అయితే మనం అమ్మాయిలతో స్మగ్లింగ్ కంటిన్యూ చేయవచ్చు బాస్.....మనం చేసే నేరాలన్నీ రాంబాబుమీదికి వస్తాయ్.....' అన్నాడు జాకాల్.

బ్రిలియంట్ అయిడియా.... రేపట్నుంచి మనం అమ్మాయిల్ని సింగపూర్ , హాంకాంగ్‌లకి పంపిస్తాం. అక్కడ వాళ్లకి డాక్టర్లు, పొట్టపరేషను చేసి పొట్టలో డైమండ్స్ పెట్టి కుట్టేస్తారు. మళ్ళీ వాళ్ళు ఇండియాకి రాగానే ఇక్కడ డాక్టర్ల చేత పొట్టఓపెన్ చేయించి డైమండ్స్ తీసేసుకుంటాం.....' చెప్తూ ఆగాడు బిగ్‌బాస్ అందరివంకా చూస్తూ.

'తరువాత మనకి సాయంచేసిన ఆ అమ్మాయిలకి మంచి రెమ్యూనరేషన్ ఇచ్చి పంపేస్తాం .... అంతేకదబాస్?' హుషారుగా అన్నాడు జాకాల్.

జాకాల్ అన్నమాటలకి బిగ్‌బాస్‌కి చాలా బాధ కలిగింది.

'ఆహా జాకాల్ ....నీ మైండుకేమైంది? మన రహస్యాలు తెలిసిన అమ్మాయిల్ని జతకనిస్తమా? మొన్న ఆ అమ్మాయిని చంపెయ్యలేదు?...... అలానే అందర్నీ చంపేస్తాం ..... అంతేకాదు .....పోలీసులకి రాంబాబు మీద ఇంకా అనుమానం రావడానికి స్మగ్లింగ్‌కి సంబంధించిన కొన్ని కాగితాలూ, మొన్న మనం చంపిన అమ్మాయి ఫోటో రాంబాబు ఇంట్లో పడేసి పోలీస్‌లకి ఓ ఫోన్ కొట్టండి.....హ్హాహ్హాహ్హా,.....'

'అలాగే బాస్.....ఒరేయ్ జగ్గు, వీరూ.... రాంబాబు ఇల్లు మీకు తెలుసుగా? ఆ పనేదో మీరే చెయ్యండి.'

'అలాగే ....' అన్నాడు జగ్గు మీసం మెలేస్తూ.

'అంతేకాదు....ఆ రాంబాబు ఎక్కడున్నా మనం వెతికి పట్టుకోవాలి!' అన్నాడు బిగ్‌బాస్.

'పోలీసులకి పట్టివ్వడానికా బాస్?' హుషారుగా అడిగాడు వీరూ.

నువ్విలాంటి తెలివి తక్కువ ప్రశ్నలేస్తే నీ ఉద్యోగం పర్మనెంటు చేయనంతే ....నీ ప్రొబేషన్ మరో మూడు నెలలకి ఎక్స్‌టెండ్ చేస్తా.....' బిగ్‌బాస్ గర్జించాడు.

వీరూ నాలుక కొరుక్కుని చెంపలేస్కున్నాడు.

'రాంబాబుని వెతికి పట్టుకొని చంపెయ్యాలి! ఆ తరువాత అతని శవాన్ని మాయం చెయ్యాలి!!.... మనం మన నేరాలు హాయిగా చేస్కుంటూ ఉంటాం.....పోలీసులు మాత్రం చనిపోయిన రాంబాబు కోసం వెతుకుతూ ఉంటారు..... రాంబాబు దొరకడు మన నేరాలు ఆగవు.... హ్హాహ్హాహ్హా..... ఖళఖళ్‌ఖళ్'

'ఈ వేళ చాలా నవ్వారు.... ఇంకా ఆపెయ్యండి బాస్ .... దగ్గొస్తుంది' జాకాల్ మెల్లగ అన్నాడు.

గ్లాస్‌డోర్సు వెనకాల కాస్సేపు దట్టమైన పొగలు వ్యాపించాయి ..... పొగ పోయింతర్వాత బిగ్‌బాస్ కూర్చున్న కూర్చీ ఖాళీగా వుంది.

### *ఇన్‌ఫార్మర్?*

ఇనస్పెక్టర్ శ్రీరామ్ రివాల్వింగ్ ఛైర్‌లో అటూ ఇటూ తిరుగుతున్నాడు. అతని ఎదురుగా కానిస్టేబుల్ నూటపదకొండు చేతులు కట్టుకుని నిల్చున్నాడు.

'దొరికినట్టే దొరికి రాంబాబు తప్పించుకున్నాడు.'

'యస్‌సార్'

'నాట్ యస్స్ సార్?.... అసలు నిన్ను షూట్ చెయ్యాలి!... రాంబాబు ఎక్కిన లారీ నెంబరు నోట్ చేస్కుని వుంటే రాంబాబు ఎక్కడ దిగాడో తెలిసేది...."

"ఎలాసార్? ..... అంతెత్తున వున్న కొండమీది నుండి కిందవెళ్తున్న లారీ నెంబరు ఎలా కనిపిస్తుంది సార్?"

"అసలు ఆ లారీ డ్రైవర్ని షూట్‌చెయ్యాలి.... రాంబాబుని పట్టుకుని ఉంటే మనకి ఎంత క్రెడిట్ దక్కేది...."

“నాక్కూడా ప్రమోషన్ వచ్చుండేది సార్.....”

“రాంబాబు ఎక్కడున్నాడో తెలీదు....ఒక ప్రక్క స్మగ్లింగ్ జరుగుతూంది.... ఆ ముఠా నాయకుడెవరో తెలీదు.... పైనుండి ఆఫీసర్ల ప్రెషర్ ఒకటి!.....ఓహ్ నా తల తిరిగిపోతూంది....”

“మీ తల అందుకు తిరగడంలేదు సార్”

“మరెందుకు తిరుగుతుంది?” ఆశ్చర్యంగా నూటపదకొండు వైపు చూశాడు ఇన్స్పెక్టర్ శ్రీరాం.

“మీరా రివాల్వింగ్ చైర్‌లో కూర్చుని గిరాగిరా తిరుగుతున్నారు సార్....”

అంతలో ఫోన్ మోగింది. శ్రీరాం రిసీవర్ ఎత్తాడు.

“హలో ఇన్‌స్పెక్టర్ శ్రీరాం హియర్....”

“చూడు మిస్టర్ శ్రీరాం...నేను చెప్పేది జాగ్రత్తగా వినండి.....”

“హలో ఎవరు మీరు?”

“మీ శ్రేయోభిలాషిని!”

“పేరు”

“పేరేదైనేం? చెప్పాగా మీ శ్రేయోభిలాషినని .....మీతో ముఖ్యమైన ఇన్‌ఫర్మేషన్ ఇవ్వాలని ఫోన్ చేశాను”

“ఏమిటది?”

“మీరు స్మగ్లింగ్ ముఠాను పట్టుకోవాలని విశ్వప్రయత్నాలు చేస్తున్నారని నాకు తెలుసు.... ఆ ముఠా నాయకుడు ఎవరో నాకు తెలుసు”

“ఎవరు? ఎవరు? ఎవరు? ఎవరు” కంగారుగా అడిగాడు శ్రీరామ్.

“రాంబాబు!”

శ్రీరామ్ నోరు తెరిచాడు.

“రాంబాబా?.... రాంబాబు ఇప్పుడెక్కడున్నాడు?”

“రాంబాబు ఎక్కడున్నాడో మీరు కనుక్కోవాలి!”

“రాంబాబే స్మగ్లింగ్ ముఠాకి నాయకుడని మీకెలా తెల్సు?”

“నాకు తెల్సు... అంతే. మీరు రాంబబు ఇంటిని సోదా చేస్తే మీకు అధారాలు దొరుకుతాయి....”

“మొన్న ఒకసారి చేశాం..... ఆ మధ్య హత్య చేయబడిన నీలిమ డైమండ్ నక్లెస్ తప్ప ఇంకేమీ దొరకలేదు....”

“మరోసారి సోదా చేయండి....”

“అలాగే...మీ పేరు చెప్పండి....”

“నేను చెప్పను....”

“చెప్పండి....లేకపోతే షూట్ చేస్తాను...ప్లీజ్....”

అవతల మనిషి ఫోన్ డిస్కనెక్ట్ చేశాడు.

## *ఫ్రేమ్ - 26*

### *పట్టుకుంటే పదివేలు*

అప్పుడు సమయం ఉదయం ఏడు గంటలైంది.

ఊరు చివర.

రాంబాబూ, కిష్టయ్య ఆ ప్రదేశం మొత్తం గంటనుండీ గాలిస్తున్నారు. ఆ ప్రదేశంలోనే నీలిమ శవాన్ని వాళ్ళుఫోటో తీశారు. హంతకులకి సంబధించిన క్లూలు ఏమీ వాళ్లకు అక్కడ దొరకలేదు.

"ఒక పనిచేద్దాం గురూగారూ....హంతకులు ఇక్కడినుండి శవాన్ని తీస్కెళ్ళి ఊబిలో పడేశారుకదా? అక్కడ కూడా వెతుకుదాం" అన్నాడు కిష్టయ్య.

"పద...." అన్నాడు రాంబాబు అడుగులు ముందుకువేస్తూ.

ఊబిదగ్గర కూడా వాళ్లకి ఏ విధమైన ఆధారాలు దొరకలేదు.

"మనం వేరే మార్గం ఏదైనా ఆలోచించాలి!" నిస్పృహగా అన్నాడు రాంబాబు.

ఇద్దరూ మెయిన్ రోడ్డుదాకా నడుచుకుని వచ్చారు. సిటీవైపు వెళ్లే లారీ ఒకదానిని ఆపారు.

"ఎక్కడికి వెళ్ళాలి సార్?" అన్నాడు లారీ డ్రైవర్.

"ఊళ్ళోకి...." చెప్పాడు. కిష్టయ్య.

"ఎక్కండి ...." క్యాబిన్ తలుపు తెరుస్తూ అన్నాడు.

రాంబాబు, కిష్టయ్యా ఇద్దరూ లారీ ఎక్కి క్యాబిన్‌లో డ్రైవర్ ప్రక్కన కూర్చున్నారు. దుమ్ము రేపుకుంటూ లారీ ముందుకు కదిలింది. ఒక అయిదు నిమిషాల తరువాత రోడ్డు ప్రక్కన ఒక పాక హోటల్ ముందు లారీ ఆపాడు డ్రైవర్.

"కాస్త వేడి వేడి టీ తాగొస్తాను....మీరు కూడా తాగుతారా?" ఇద్దర్నీ అడిగాడు డ్రైవర్.

"ఊహు....నువ్వెళ్ళు....మేం లారీలోనే కూర్చుంటాం" అన్నాడు రాంబాబు.

లారీ డ్రైవర్ కిందికి దిగి పాకదగ్గరకు వెళ్ళాడు. పాకముందున్న బెంచీ మీద ఇద్దరు వ్యక్తులు కూర్చుని ఇడ్లీలు తింటున్నారు. తనూ బెంచికి చివరగా కూర్చుని టీకి ఆర్డరు ఇచ్చాడు లారీ డ్రైవర్.

రెండు నిమిషాల్లో వేడివేడి టీ వచ్చింది. లారీ డ్రైవర్ మెల్లమెల్లగా టీ చప్పరించసాగాడు. అతను కుర్చున్న బెంచీకి ఎదురుగా స్టూలుమీద ఒక వ్యక్తి న్యూస్‌పేపరు చదువుతున్నడు.

డ్రైవర్ టీ తాగడం పూర్తిచేసి కప్పు నేలమీద పెట్టాడు. డబ్బులు కోసం వచ్చిన కుర్రాడిచేతిలో అర్ధరూపాయి పెట్టి లేచాడు.

అప్పుడు చూశాడు అతను ఎదురుగా కూర్చుని ఉన్నతని చేతిలోని పేపరు వంక.

డ్రైవర్ కళ్ళు చిట్లించి చూశాడు. అతనికి ఏదో అనుమానం వచ్చింది.

గబగబా దగ్గరకు వెళ్ళి వగి పేపరువంక చూశాడు. సందేహం లేదు....

“ఒకసారి ఈ కిందపేజీ ఇస్తారా సార్?” అన్నాడు డ్రైవర్ అతనితో.

అతను అడుగుపేజీతీసి డ్రైవర్‌కి ఇచ్చాడు.

డ్రైవర్ ఆ న్యూస్‌ని గబగబా చదివాడు. ఒకటికి రెండుసార్లు చదివాడు.

అతని కళ్ళు ఆనందంతో విప్పారాయ్.

“ఏవండీ నాకీ పేజీ ఇచ్చేయ్యండి ప్లీజ్....” అన్నాడు ఆ వ్యక్తితో.

“కానీ నేను ఇంకా ఆ పేజీ చదువలేదు” అన్నాడతను.

ఈ పేజీలో వార్తలేవీ లేవండీ....ఎక్కువగా అడ్వర్‌టైజ్‌మెంట్లే ఉన్నాయ్....ప్లీజ్.....ఏదో కంపెనీలో ట్రక్ డ్రైవర్ల పోస్టులు ఖాళీ ఉన్నాయట...నేను ఉద్యోగానికి దరఖాస్తు పెట్టుకోవాలి....ప్లీజ్....వస్తానుసార్”

అతను ఏమంటాడో ఎదురు చూడకుండా ఆ పేపరు పట్టుకుని ముందుకు పరుగెత్తాడు డ్రైవర్.

హుషారుగా విజిలేసుకుంటూ డ్రైవర్ లారీ ఎక్కిస్టార్ట్ చేసి లారీని ముందుకు పరుగెత్తించాడు.

కాస్త దూరం వెళ్లాక సంతోషం పట్టలేకపోయాడు.

“హహహ....” గట్టిగా నవ్వాడు.

కిష్టయ్య, రాంబాబు డ్రైవర్ వంక వింతగా చూశారు. ఎందుకలా హఠాత్తుగా కారణం లేకుండా నవ్వుతున్నాడు?....

ఏమో.... మనకేందుకులే అనుకున్నారు.

కాస్సేపు పోయాక మళ్ళీ గట్టిగా నవ్వాడు వీళ్ళిద్దరివంకా చూస్తూ,

హహహ....హోహోహో.....”

కిష్టయ్య జాలిగా డ్రైవర్ వంక చూశాడు.

“పాపం! ..... ఆ పాకలో టీతాగాడు.... ఇందాక బాగానే ఉన్నాడు.... ఆ టీ తాగింతర్వాత కాస్త మతి చలించినట్టుంది....”

“మనం తాగకపోవడమే మంచిదైంది.....”

“హహహ....”

“మనం లారీ ఆపి దిగిపోదామా?....ఎక్కడైనా యాక్సిడెంట్ చేస్తాడో ఏం ఖర్మో....”

“ఎందుకూ.... అలా నవ్వినా లారీని చాలా బ్యాలెన్సుడుగానే నడుపుతున్నాడు....”

“హోహోహో.... యాక్సిడెంటు చేయనులే....జాగ్రత్తగా తీస్కెళ్ళి పోలీసులకి అప్పజెప్పుతాను....హహహ” శరీరం మొత్తం కుదుపుతూ నవ్వాడు లారీ డ్రైవర్.

రాంబాబూ కిష్టయ్యా ఉలిక్కిపడ్డారు.

“పోలీసులకి అప్పజెప్పడం ఏమిటీ?....” ఆశ్చర్యంగా అడిగాడు రాంబాబు.

“అబ్బా....చాలా అమాయకుడిలా నటిస్తున్నావే నీకు స్మగ్లర్లతో సంబంధం ఉందిగా?....”

అన్నాడు లారీడ్రైవరు.

"నాకా? స్మగ్లర్లతోనా??...." ఆశ్చర్యంగా అడిగాడు రాంబాబు.

"హత్యలు అంటూ బహువచనం ఏంటి? ఒక్క హత్యేగా ??...." కంగారుగా అన్నాడు రాంబాబు.

కిష్టయ్య రాంబాబు భుజంపట్టి కుదిపాడు.

"అదేంటి గురూగారూ ఒక్కహత్య అని అంటారు ....ఆ హత్య మాత్రం మీరెక్కడ చేశారు?"

"అవును నేనెక్కడ చేశాను?...."

"నువ్వెక్కడ చేశావో, ఎవర్ని చేశావో అన్నీ పోలీసులకి తెలుసు గానీ...నిన్ను వాళ్లకి అప్పజెప్పినతరువాత వివరాలన్నీ వాళ్ళదగ్గరేకనుక్కో....హహహ...."

"నువ్వు ఈయన్ని ఎవరనుకుని పొరబాటు పడ్తున్నావోగానీ ఈయన అలాంటివాడు కాడు అబ్బీ....చాల మంచివాడు ....మంచివాళ్ళెక్కడైనా స్మగ్లింగూ హత్యలూ చేస్తారా?...." అన్నాడు కిష్టయ్య.

"ఆ....ఆ.... వేషాలు చాల్లే....మీరు నానుంచి తప్పించుకోలేరు.... నాకంతా తెల్సు...నేను అతన్ని పోలీసులకి అప్పచెప్పకుండా వదల్ను...."

అతనితో ఇలా వాదించి లాభం లోదని తెలిసిపోయింది రాంబాబుకి, అందుకే మెల్లగా మస్కాకొట్టి తప్పించుకోవాలి అనుకున్నాడు.

"చూడుబాబూ.... అన్నట్టు నీపేరు?" అడిగాడు రాంబాబు.

"హహహ....పుల్లయ్య...."

"హహహ పుల్లయ్య ....చాలా బాగుంది ....హహహ నీఇంటిపేరా?"

"హహహ నా ఇంటిపేరుకాదు..... నేనిప్పుడు నవ్వాను నాపేరు వట్టి పుల్లయ్యే....చికాకుగా చూస్తూ అన్నాడు పుల్లయ్య.

"ఓహ్ పుల్లయ్య....పేరు చాలాబాగుంది కదరా కిష్టయ్యా?"

"అవును గురూగారూ....వెరీస్వీటీనేమ్.... పేరుకుతగ్గరూపం.... కదండీ?"

"అవున్రా కిష్టయ్యా.... కానీ కిష్టయ్యా..... పుల్లయ్య పైకట్లా కన్పించినా మనసుమాత్రం వెన్నరా తెల్సా?"

"నాకు తెల్సులెండి గురూగారూ..... అందుకేగా పుల్లని వాసన వస్తుంది...."

అదేం వెన్నవాసనకాదు...నేను వేస్కున్న బట్టలవాసన. రెండ్రోజుల్నుండీ స్నానం చెయ్యలేదు. ఈ రెండ్రోజులూ లారీమీదే ఉన్నాను...."

"పోన్లే అబ్బీ....ఆ వాసన దేని వాసనైతేనేంగానీ నీమనసువెన్నే....నువ్వెవరు బాధపడినా చూళ్ళేవు.... అవునా?"

"కాదు...." అన్నాడు పుల్లయ్య.